క్లుప్తంగా

ముగిసిన శీతలామాత జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీటీసీ శిరీష, శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: పట్టణంలో మూడురోజుల పాటు నిర్వహించిన శీతలామాత(సంతానలక్ష్మి) అమ్మవారి జాతర మంగళవారం ముగిసింది. మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా, భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆఖరి రోజున జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి,గరివిడి మండలం కోనూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మెయింటెనెన్స్, విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో చీపురుపల్లి,గరివిడి మండలాల్లోని పలుగ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని ఆర్‌ఈసీఎస్ ఏడీఈ.జగన్నాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి సబ్‌స్టేషన్ పరిధి పుర్రేయవలస, రామలింగాపురం, విశ్వనాథపురం, చింతలపేట, చుక్కవలస గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, గరివిడి మండలం కోనూరు సబ్‌స్టేషన్ పరిధి పర్ల, ఇటకర్లపల్లి, పోతాయవలస, పి.ఎస్.లక్ష్మీపురం,శివరాం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాజీ సర్పంచ్ రాముడునాయుడు మృతి



రామునాయుడు (ఫైల్)

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని దుమ్మెద గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎలకల రామునాయుడు (92) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన దుమ్మెద పంచాయతీకి 45 ఏళ్లు సర్పంచ్‌గా పనిచేశారు. 1978లో చీపురుపల్లి సమితి వైస్ ప్రెసిడెంట్‌గా, 1983లో కాంగ్రెస్ మండల పార్టీఅధ్యక్షుడిగా సేవలందించారు. ఈయన మృతిపై పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శ్యామ్‌సుందర్

గంట్యాడ: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని నరవ పశువైద్యాధికారి శ్యామ్‌సుందర్ పాడి రైతులకు సూచించారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో పాడి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను మంగళవారం వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయని, పాల ఉత్పత్తి కూడా తగ్గిపోతుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తోందని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

భూసర్వేతో వివాదాలకు చెక్



నిమ్మలవలసలో సర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సురేష్

చీపురుపల్లిరూరల్: ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూరీసర్వేతో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, వివాదాలకు చెక్ పడనుందని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు.మండలంలోని నిమ్మలవలస, దేవరపొదిలాం పంచాయతీల్లో భూసర్వే నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల రైతులు, నాయకులకు సర్వేపై క్షేత్రస్థాయిలో మంగళవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వే చేసేసమయంలో పొలాల వద్ద రైతులు ఉండి రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎంపీటీసీ అధికార్ల శ్రీనివాసరావు, నాయకులు తమ్మిన కృష్ణారావు, చంద్రరావు, చింతాడ లక్ష్మణ, అమ్మాజీరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే 'క్షయ' అంతం



బొండపల్లి: వెదురువాడలో ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఝాన్సీ



వేపాడ: బానాదిలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



జామి: ఎం.కె.వలసలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి భాగ్యరేఖ



వేపాడ: గురుకులంలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

బొండపల్లి: ప్రాణాంతక క్షయ (టీబీ)వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో పాటు అవగాహన కలిగిఉండాలని దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి జె.ఝాన్సీ అన్నారు. మండలంలోని వెదురువాడ గ్రామంలో గజపతినగరం టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులకు క్షయపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకినట్లు సకాలంలో గుర్తించకుంటే మరణానికి దారితీస్తుందని చెప్పారు. దగ్గు, బరువుతగ్గిపోవడం , రాత్రిళ్లు జ్వరం, నీరసం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలుంటే పీహెచ్‌సీలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తామని అన్నారు. మందులు వాడుతూ సరైన పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నయమవుతుందని వివరించారు. అలాగే ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఉపాధి పనులకు హాజరయ్యే వేతనదారులు వడ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 11 గంటలకు పనులు ముగించుకోవాలని, తాగు నీరు,మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో టీబీ నివారణ

జామి: క్షయ రోగులు మందులతో పాటు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి తొందరగా నయమవుతుందని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ అన్నారు. ఎస్.కోట టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఎం.కె.వలస, జన్నివలస గ్రామాల్లో ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలను వివరించారు.వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, డీబీటీ, పౌష్టికాహారం పంపిణీ తదితర అంశాలపై వివరించారు. టీబీ సూపర్ వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి గురించి తెలుసుకుందాం

వేపాడ: 'క్షయ వ్యాధి గురించి తెలుసుకుందాం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బక్కునాయుడుపేట గ్రామ సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రాజు మంగళవారం అవగాహన కల్పించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. 12 మంది పలు రుగ్మతలతో బాధపడుతున్నట్లు గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొన్నారు.

గ్రామాల్లో ర్యాలీలు

వేపాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని వల్లంపూడి, నీలకంతరాజపురం, బానాది,గుడివాడ, శింగరాయి, ఆతవ, నల్లబిల్లి, వావిలపాడు తదితర గ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పరీక్షల సమయంలో ప్రత్యేక బస్సులు నడపాలి



ఇన్‌చార్జి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

చీపురుపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని అఖిల భారత్ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంపత్‌కుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటేశ్వరరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరేందుకు వీలుగా ప్రత్యేక బస్సు సరీ్వసులు నడపాలని విన్నవించారు. సాధారణ బస్సు సర్వీసుల్లో విద్యార్థులు ప్రయాణిస్తే పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందన్నారు.అలాగే పలు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు హాల్ టిక్కెట్ల పేరుతో అధిక ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. హాల్ టిక్కెట్ల పేరుతో వేధిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏబీవీపీ ప్రతినిధులు ఆనంద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి, పౌష్టికాహారం పంపిణీ



విద్యార్థులకు విద్యా సామగ్రి, పౌష్టికాహారం అందిస్తున్న దాత, తదితరులు

శృంగవరపుకోట: మండలంలోని విశాఖ–అరకు రోడ్డులోని ఎస్.ఆర్ పెట్రోల్ బంకు వార్షికోత్సవం సందర్భంగా బంకు యాజమాన్యం మరుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాసామగ్రి, పౌష్టికాహారం మంగళవారం పంపిణీ చేసింది. ఒక్కొక్కరికి 5 నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్, స్టీల్ కంచం, గ్లాసు, 8 చొప్పున కోడిగుడ్లు, స్నాక్స్‌ను బంకు యజమాని రెడ్డి దేముడుబాబు అందజేశారు. హెచ్‌ఎం ఎ.రాము, బంకు సేల్స్‌మేనేజర్ మహ్మద్ షరీఫ్, మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానం



పూడుకుపోయిన కల్వర్టులో మట్టిరాళ్లు తీస్తున్న రైతులు

శృంగవరపుకోట: విశాఖ–అరకు రోడ్డులోని కల్వర్టు పూడుకుపోవడంతో కుశ్ల కోనేరు ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పంటలు ఎండిపోతుండడంతో అంబటి కళ్లాలు, పొట్నూరు కళ్లాలకు చెందిన రైతులు శ్రమదానంతో కల్వర్టులోని పూడికలను మంగళవారం తొలగించారు. గంటల తరబడి శ్రమించి సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా 5 అడుగుల లోతున ఉన్న కల్వర్టులోని రాళ్లు, మట్టిని తీశారు. పలుసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో పూడికలను తొలగించామని రైతులు మోపాడ నాయుడు, స్వామినాయుడు, శ్రీనివాసరావు, పొట్నూరు వెంకటరమణ, నర్సింహమూర్తి, శ్రీనివాసరావు, రమణ, దామోదర శ్రీధర్, అప్పారావు, పొసెట్టి శ్రీను, నానిగిరి సూరిబాబు, డి.సూర్యారావు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా బుధవారం సాయంత్రం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కె.రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు 99592 25619, 73829 23679 నంబర్లను సంప్రదించి సమస్యలు వివరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా ఉదయం 6.30 గంటల నుంచి తాటిపూడి మీదుగా విజయనగరం వెళ్లే సర్వీసు వేళలు 6.45 గంటలకు మార్చినట్లు వివరించారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ డైరెక్టర్ బాల వెంకటరమణ

బొండపల్లి: మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఆర్‌సెటీ డైరెక్టర్ జి.బాల వెంకట రమణ సూచించారు.స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో పుట్టగొడుగుల తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా నిలదొక్కు కోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తోందని, కుటీర పరిశ్రమల స్థాపన, చిరువ్యాపారాలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తోందని వివరించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ కె.సావిత్రి, గజపతినగరం క్లస్టర్ ఏరియా కో–ఆర్డినేటర్ వి.లక్ష్మునాయుడు, వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి, సీసీలు, స్వయం సహాయక సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



కనకమోహన్

కొత్తవలస: రాజుపాత్రునిపాలెం గ్రామానికి చెందిన పంచదారుల కనకమోహన్ రెండు రోజులుగా కనిపించడం లేదని ఆయన భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ ఎస్.బాల సూర్యారావు మంగళవారం తెలిపారు. కనకమోహన్ విశాఖపట్నంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారని, ఈ నెల 12న డ్యూటీ నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి తిరగి రాలేదని, తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పశువులపై కుక్కల దాడి

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు గ్రామంలో పలువురు పాడిరైతులకు చెందిన పశువులపై వీధి కుక్కలు మంగళవారం దాడి చేశాయి. దాడిలో కోరుకొండ సన్యాసిరావుకు చెందిన గేదె పెయ్యిని చనిపోయింది. మల్లివీడుతో పాటు పలుగ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ పశువులపై దాడి చేస్తున్నాయి.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



గజపతినగరంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ విజయకుమారి



వేపాడలో ఇన్విజిలేటర్లకు సూచనలిస్తున్న పరీక్షల చీఫ్‌సూపరింటెండెంట్ సింహాద్రప్పడు

చీపురుపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నా యి. చీపురుపల్లి పట్టణంలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీనివాస,గాయత్రీ జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా అధికారులు ఎంపిక చేసి, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. .

18 గదులు కేటాయింపు

గజపతినగరం: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయకుమారి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ఎం.వెంకటాపురం గ్రామంలోని శ్రీకృష్ణ జూనియర్ కళాశాలలు కేంద్రాలుగా పరీక్షలు నిర్వహించనున్నామని, పరీక్షల కోసం 18 గదులు కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 411మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 392 మంది, శ్రీకృష్ణ జూనియర్ కళాశాల కేంద్రంలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 280 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 273 మంది పరీక్ష రాయనున్నారు.

సర్వం సిద్ధం

కొత్తవలస: కొత్తవలస, ఎల్.కోట మండలాల్లో ఇంటర్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కొత్తవలసలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాగ్దేవి డిగ్రీ కళాశాల, ప్రగతి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో 517 మంది, ప్రగతి కళాశాలలో 533 మంది, వాగ్దేవి డిగ్రీ కళాశాలలో 425 మంది పరీక్షలు రాయనున్నారు. ఎల్.కోట మండల కేంద్రంలో మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ 418 మంది పరీక్షలు రాయనున్నారు.

వేపాడలో..

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశామని ప్రిన్సిపాల్ అప్పారావు మంగళవారం తెలిపారు.ఈ కేంద్రంలో 316 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా బోజంకి సింహాద్రప్పడు, డీఓగా కె.దివాకర్ వ్యవహరిస్తారన్నారు. ఇన్విజిలేటర్లకు సూచనలు, సలహాలు అందించారు.

భయం వీడి.. ప్రశాంతంగా రాయండి



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న గురుకులాల జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రావతి

చీపురుపల్లి: పబ్లిక్ పరీక్షలంటే భయం వీడి ప్రశాంతంగా రాయాలని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలు/కళాశాలల జిల్లా కో–ఆర్డినేటర్ బి.చంద్రావతి విద్యార్థినులకు సూచించారు. బుధవారం నుంచి ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలకు మంగళవారం ఆమె వచ్చారు. విద్యార్థినులకు ఆల్‌ది బెస్ట్ చెప్పి, అనవసరంగా భయపడకుండా సంపూర్ణ ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కళాశాల నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థినులు 69 మంది , ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలు 71 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

గ్లాసులు, ప్లేట్ల పంపిణీ

స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో అయితో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్టీల్ గ్లాసులు, ప్లేట్లను చంద్రావతి పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు



దత్తిరాజేరు: కె.కొత్తవలసలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



బొండపల్లి: నెలివాడలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వేదవతి

దత్తిరాజేరు/ బొండపల్లి: దత్తిరాజేరు మండలంలోని కె.కొత్తవలస, బొండపల్లి మండలంలోని నెలివాడ గ్రామ సచి వాలయాల్లో ఆయా మండలాల ఎంపీడీఓలు సుబ్రహ్మణ్యం, ఏ.వేదవతి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. సిబ్బంది అంతా తమ జాబ్ చార్టుకు అనుగుణంగా పని చేయాలని చెప్పారు. కె.కొత్తవలసలోని జగనన్న కాలనీని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సందర్శించి, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీఓలు వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా కోటమ్మ తల్లి పండగ



శృంగవరపుకోట: కొట్టాంలో అమ్మవారి ఉరేగింపులో బిందెల డ్యాన్స్

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామంలో గ్రామదేవత కోటమ్మ తల్లి పోతు పండగను మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గద్దె గుడిలోని కోటమ్మ ఉత్సవ మూర్తిని గ్రామస్తులు దర్శించి మొక్కులు చెల్లించారు. కోలాటాలు, భజనలు, చిరతలు, గరగల బృందం, బిందెల డ్యాన్స్, తీన్‌మార్, డప్పులతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

గొల్లుపాలెంలో..

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో కోటమ్మ తల్లి పండగను ఘనంగా గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే వెళ్లి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామపెద్దలు తగిన ఏర్పాట్లు చేశారు.

అభయాంజనేయ స్వామి తీర్థం

వేపాడ: మండలంలోని బొద్దాంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అభయాంజనేయ స్వామి తీర్థం మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం గుర్రాల పరుగు ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

నేటి నుంచి భద్రమహంకాళి తీర్థం

లక్కవరపుకోట: మండల కేంద్రం భద్రమహంకాళి అమ్మవారి తీర్థం బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. సంబంధిత ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. తీర్థం సందర్భంగా జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను గురువారం నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతకు రూ.5వేలు, ద్వితీయ స్థానానికి రూ.3వేలు, తృతీయ స్థానానికి రూ.2వేల నగదు బహుమతి అందజేయనున్నామనిచ ఆసక్తి గల వారు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పైథాన్ ప్రోగ్రామింగ్‌తో ఉద్యోగవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జాషువా జయప్రసాద్

చీపురుపల్లిరూరల్(గరివిడి): సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యంత డిమాండ్ ఉన్న పైథాన్ ప్రోగ్రామింగ్‌పై పట్టు సాధించే వారికి మంచి ఉద్యోగవకాశాలు ఉన్నాయని గరివిడి అవంతి సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువాజయప్రసాద్ అన్నారు. స్థానిక కళాశాలలో విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పైథాన్ ప్రోగ్రామింగ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్‌లెర్నింగ్, రోబోటిక్స్ వంటి అప్లికేషన్లను అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందన్నారు. పదిహేను రోజుల పాటు శిక్షణ ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్ కె.రవిశంకర్, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, సీఎస్‌ఈ విభాగాధిపతి ఎం.ఉమామహేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు,అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

- డీపీఎం బాలాజీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న బాలాజీ

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ అన్నారు. స్థానిక ఏఆర్‌టి కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లును మంగళవారం సాతి సంస్థ అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు గర్భిణులు చేయించుకోవాలన్నారు. ప్రసవం అయ్యే వరకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. వైద్యుని సలహా లేకుండా ఎటువంటి మందులు వాడకూడదన్నారు. గర్భిణులు అందరు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెచ్ఐవీ సోకిన వారు ఏఆర్‌టీ మందులు వాడాలని తెలిపారు. ఈ మందులు ప్రారంభించిన తర్వాత మధ్యలో మానివేయరాదని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ కేంద్రం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వరలక్ష్మి, డీఐసీ సాక్షి గోపాల్‌రావు, సాతి సంస్థ పీఓ సత్యనారాయణలు పాల్గొన్నారు.

అంధులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



అంధ, బధిర విద్యార్థులతో జేడీ లక్ష్మీనారాయణ

విజయనగరం: దేశంలో అంధులకి, బధిరులకి, దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవకాశాలను కలిపిస్తున్నాయని వాటిని అందుకోవడానికి మనో నిబ్బరంతో సిద్ధంగా ఉండాలని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. జేడీ ఫౌండేషన్ డెంకాడ మండలం డి.కొల్లాం ప్రతినిధులు కంటోన్మెంట్ గురజాడ పబ్లిక్ స్కూల్‌లో సారథి వెల్ఫేర్ అసోసియేషన్ అంధులకు మంగళవారం ఏర్పాటు చేసిన దుస్తులు, వంట సామాన్లు, పుస్తకాల వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా భారత మాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చూపులేదని చింత పడకుండా మనో నేత్రంతో సమాజంలోని రుగ్మతలను గుర్తించి అందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సారథి వెల్ఫేర్ అసోసియేషన్ విద్యార్థులకు తమ జేడీ ఫౌండేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు ఉంగ ఆదినారాయణ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి మజ్జి కృష్ణారావు, గురజాడ స్కూల్ కరస్పాండెంట్ స్వరూప పాల్గొన్నారు.